ట్రాఫిక్ నియంత్రణ వద్దు.. కేసులే ముద్దు

- కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు
- బండి తాళాలు తీసుకుని వాహన చోదకులను ఇబ్బంది పెడుతున్న వైనం
- మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాలికి..
- రాంగ్ పార్కింగ్, రాంగ్‌రూట్ ప్రయాణాలపై చర్యలు శూన్యం


ఆర్ అండ్ బీ జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు


పంజాబ్ హోటల్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో వదిలేసిన తుప్పపట్టిన వాహనం

మర్రిపాలెం: కొందరు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టకుండా.. కేసుల నమోదు, జరిమానాలు విధించడానికే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇటీవల కాలంలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న విషయం తెలిసిందే. కొన్ని చోట్ల ట్రాఫిక్ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్న సందర్భాలు అనేకం. ముఖ్యంగా కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణను ఏమాత్రం పట్టించుకోకుండా.. దారిన పోయే వాహన చోదకులను అడ్డుకుని తనిఖీలు చేయడంలో యమ బిజీగా ఉన్నారు. వీరికి కేసులు నమోదు చేయడంపై ఉన్న మక్కువ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై లేదని పలువురు వాహన చోదకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

గంటల తరబడి ఇబ్బంది..

అత్యవసర పనుల నిమిత్తం వాహనాలపై వెళ్లే వారిని ఆపి తాళాలు లాక్కుంటున్న ట్రాఫిక్ పోలీసులపై తీరుపై వాహన చోదకులు మండిపడుతున్నారు. ఆన్‌లైన్‌లో జరిమానాలు, చలానాలు విధిస్తున్న తరుణంలో పత్రాల కోసం వాహనాలను ఆపడమేంటని ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు మీరితే చర్యలు తీసుకోవాలే గానీ.. ఇలా ఇబ్బంది పెట్టడమేంటని వాపోతున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఇటీవల వరుసగా ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద తనిఖీలు చేసి పలువురిని గంటల పాటు నిలిపి వాహనాల తాళాలు తీసుకున్న పరిస్థితి నెలకొంది. కేసులు బనాయించడం తప్పుకాదు.. ప్రస్తుత పరిస్థితుల్లో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో జరిమానాలు విధించాల్సింది ఉంది. ఇక్కడ దానికి భిన్నంగా గంటల తరబడి వాహనదారులను తప్పుచేసిన వారిలా నిల్చోపెట్టి తాళాలు లాక్కుంటున్నారు. వాహనాలపై వెళ్తున్న వారిని దారి కాసి ఆపడంతో వారు కిందపడే పరిస్థితి ఏర్పడింది.

ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లదే హవా..

వాహనాలు తనిఖీ చేయాలంటే కనీసం ఎస్‌ఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో జరపాలి. పైస్థాయి అధికారులు లేకుండానే ఏఎస్‌ఐలు, హోంగార్డులు(ట్రాఫిక్ కానిస్టేబుళ్లు) హెల్మెట్ లేదని, మరేదో లేదని వాహనాలను అడ్డుకోవడం సరికాదని పలువురు చోదకులు అంటున్నారు. హెల్మెట్, వాహన పత్రాలు లేకపోతే చలానా విధిస్తే.. ఆన్‌లైన్‌లో జరిమానా కట్టుకుంటామని, అలా చేయకుండా వివిధ పనుల నిమిత్తం వెళ్తున్న వాహన చోదకులను సిగ్నల్స్ మధ్యలోకి వెళ్లి అడ్డుకోవడం, బండి పత్రాలు చూపిస్తున్నా.. ఇబ్బంది పెట్టడం, దురుసుగా మాట్లాడటం వంటివి చేయడం తగదన్నారు. రాంగ్ పార్కింగ్‌లు, రాంగ్ రూట్ ప్రయాణాలు చేసేవారిని వదిలేసి, తనిఖీల పేరిట వాహనాలను అడ్డుకోవడంపై విమర్శిస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా.. అంటూ ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించి వాహన చోదకులను ఇబ్బందులకు గురిచేయకుండా తనిఖీలు నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాంగ్ పార్కింగ్‌పై చర్యలేవి?

జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం నుంచి **ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు** సర్వీస్ రోడ్డులో ఎంతోకాలంగా **నిలిపి వదిలేసిన** వాహనాలు తుప్పుపట్టిపోయాయి. **వీటిని** కంచరపాలెం ట్రాఫిక్ **పోలీసులు తరలించకుండా** అలానే వదిలేశారు. **బిర్లా జంక్షన్ మొదలు ఆర్** అండ్ బీ కూడలి వరకు **కార్ల షోరూంల వాహనాలను** రోడ్లపైనే పార్క్ **చేస్తున్నా.. ముడుపులు** అందడం వల్ల చూసీచూడనట్టు **వదిలేస్తున్నారని** అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.


మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుపై రాంగ్ పార్కింగ్‌లో వాహనాలు, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహన చోదకుడు

మర్రిపాలెం జంక్షన్‌లో కానరాని నిఘా

బీఆర్‌టీఎస్ రోడ్డులో మర్రిపాలెం జంక్షన్ ఎప్పుడూ గజిబిజిగానే ఉంటుంది. ఎటువైపు నుంచి ఎవరు వస్తారో తెలియని తికమక పరిస్థితి. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా.. లేనట్టే. అలంకారప్రాయంగా వాటిని పెట్టారే తప్ప.. ఒక్కరోజు కూడా వెలిగిన పాపాన పోలేదు. ఈ చుట్టుపక్కల ఒక్క ట్రాఫిక్ పోలీస్ కూడా కనిపించకపోవడం విశేషం. నిత్యం వేలాది మంది వాహన చోదకులు, పాదచారులతో రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో పోలీస్ నిఘా లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.


మర్రిపాలెం జంక్షన్‌లో గజిబిజిగా ట్రాఫిక్


ఆర్ అండ్ బీ కూడలి వద్ద వాహనాలను అడ్డుకుని ఆపడం వల్ల ఇబ్బంది పడుతున్న వాహనదారులు

క్లుప్తంగా

కనుల పండువగా కనకమహాలక్ష్మి పండగ


కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు ప్రసాదం అందిస్తున్న ధర్మకర్త, అర్చకులు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో కొలువైన కనకమహాలక్ష్మి, కనకదుర్గ, గాయత్రీదేవి ఆలయ పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యంలో అర్చకులు కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ధర్మకర్త కీర్తి కండువా వేసి ప్రసాదం అందించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాధవ్, విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి ఇరువురు చర్చించారు. నియోజకవర్గంలోని సూర్యమంగదేవికి రూ.75,729, నరసెట్టి కిషోర్‌కు రూ.22 వేలు, నడుపూరి గణేష్‌కు రూ.74,570 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు శ్యామల దీపిక, సునీల్ అగర్వాల్, సుబ్బిరామిరెడ్డి, నాగేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో ఆకస్మిక తనిఖీలు


సింహాచలం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఆదేశాలతో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం సిబ్బందితో కలిసి గురువారం పలు రైళ్లు, స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి, సరైన టికెట్లు లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి, సరిగా బుక్ చేయని లగేజీలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో 211 కేసులు నమోదు చేసి, వారి నుంచి సుమారు రూ.1.10 లక్షల జరిమానాలుగా వసూలు చేశారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 16 వరకు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 26,411 కేసులు నమోదు చేసి, వీరి నుంచి సుమారు రూ.1.5 కోట్లు అపరాధ రుసుముగా వసూలు చేసినట్లు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 13 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జె.కె.మీనాలు తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన హేమంత్ జానీ ఒడిశా నుంచి విశాఖకు గంజాయిని అక్రమంగా తీసుకురావడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద నుంచి రూ.65 వేల విలువైన 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

దోమల నిర్మూలనకు చర్యలు


కప్పరాడ పాఠశాల వద్ద కాలువలో ద్రావణం పిచికారీ చేస్తున్న సిబ్బంది


పాఠశాల ద్వారం వద్ద ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు పాత ఐటీఐ జంక్షన్ పరిధి కప్పరాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వద్ద దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు దోమలతో ఇబ్బంది పడేవారు. పాఠశాలల పరిసరాలు, టాయిలెట్లు, ఆట స్థలాలు అపరిశుభ్రంగా ఉండటం, స్కూల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందాయి. నిత్యం దోమలు కుట్టడంతో తమ పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గురువారం 'సాక్షి'లో 'బాబోయ్ దోమలు..!' అనే శీర్షికన వెలువడిన కథనానికి జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పబ్లిక్ హెల్త్ మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో కప్పరాడ పాఠశాలల పరిసరాలల్లో గురువారం ఉదయం, సాయంత్రం ల్యార్వా, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆహార వ్యాపారులకు ఫాస్టాక్ సర్టిఫికెట్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పతివాడ శ్రీను

సీతంపేట: పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ కేవీజీవీఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ(ఫాసి) ఆమోదించిన ఫాస్టాక్ శిక్షణ, సర్టిఫికెట్ కార్యక్రమం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పతివాడ శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండి ప్రియాంక, గవర వెంకటరమణారావు మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత సంస్థ నియమాలు పాటించాలన్నారు. ప్రతి ఆహార వ్యాపారి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆదాయమే ప్రధానం కాకుండా మనసాక్షితో సేఫ్టీ ఫుడ్‌ను ప్రజలకు అందించాలని కోరారు. ఫుడ్ లైసెన్స్‌తోపాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఫాస్టాక్ ట్రైనర్ డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 2017 అక్టోబర్ 6, ఎఫ్ఎస్ఎస్ యాక్ట్ సెక్షన్ 16(3)హెచ్ ప్రకారం ప్రతి వీధి వ్యాపారి మొదలు తినుబండారాలు అమ్మేవారు, తయారు చేసేవారు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ కర్రీపాయింట్లు, బేకరీలు, స్వీట్‌షాప్స్, చికెన్, మటన్ దుకాణాలు కచ్చితంగా ఫుడ్ లైసెన్స్‌తోపాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. కేవీజీవీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జిలు సి.మోహన్‌బాబు, సింధు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రత, నాణ్యత పాటించడం, కల్తీని గుర్తించడం ఫాస్టాక్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా టీంహెడ్ కాండవ గాయత్రి, జగన్ మురారి, ఎగ్జిక్యూటివ్స్ సూర్య, శ్రీదేవి, దీప్తి, వసంత, లావణ్య, పెద్ద సంఖ్యలో ఫుడ్ వ్యాపారులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో సిటూ విశాఖ జిల్లా మహాసభలు

దాబాగార్డెన్స్: సీఐటీయూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో కంచరపాలెం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. గురువారం సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన వివిధ కార్మిక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. హోటల్స్, హాస్పటల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, రోడ్డుపై చిల్లర వర్తకులు, ఆటో, మోటార్, రవాణా రంగ కార్మికుల హక్కులు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు


బ్రహ్మకమలాలకు పూజలు చేస్తున్న శిరిపురపు సత్యవతి

మురళీనగర్: బ్రహ్మకమలాల ప్రత్యేకతే వేరు. కేవలం ఆకు నుంచి మొగ్గ తొడిగి పొడవైన వృత్తంతో పెద్ద పుష్పంగా రూపాంతరం చెంది చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఏడాదికోసారి మాత్రమే పుష్పించే ఈ పుష్పరాజం పెందుర్తిలోని ఒక ఉపాధ్యాయుడి ఇంటిపై టెర్రస్ గార్డెన్‌లో ఒకేసారి ఐదు వికసించాయి. శిరిపురపు శ్రీనివాసరావు, సత్యవతి దంపతులకు టెర్రస్ గార్డెన్ పెంపకంలో మంచి అనుభవం ఉంది. సత్యవతికి మొక్కలంటే విపరీతమైన ప్రేమ. దీంతో ఆమె టెర్రస్ గార్డెన్ ఏర్పాటు చేసి వివిధ రకాల పుష్ప జాతులతో పాటు అరుదైన పూల చెట్లు, పండ్లు, కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. దేవతా పుష్పంగా భావించే బ్రహ్మకమలం శ్రీమన్నారాయణుడికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా నమ్మకం. తమ టెర్రస్ గార్డెన్‌పై అధిక సంఖ్యలో బ్రహ్మకమలాలు విరబూసి దవళ వర్ణంలో మెరుస్తున్నాయని సత్యవతి తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇవి పూర్తి స్థాయిలో వికసించి సువాసనలు వెదజల్లుతాయని, ఉదయం పూట ముడుచుకుపోతాయన్నారు. బ్రహ్మకమలాలకు పూజ చేసిన తర్వాతనే వాటిని తాకాలని ఆమె చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శాంతినగర్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, సాయిబాబా గుడి ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చైతన్య స్రవంతులు చలం రచనలు


చలం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గద్దె సాంబశివరావు తదితరులు

సీతంపేట: అమరావతి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో గురువారం చలం స్త్రీ రచన జయంతి పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చలం రచించిన స్త్రీ, భగవాన్ స్మృతులు, పిల్లల కోసం మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. దేవి సీఫుడ్స్ డైరెక్టర్ గద్దె సాంబశివరావు చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలం రచించిన పుస్తకాలు తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. చలం ప్రశ్నించే గుణాన్ని కొనియాడారు. నవయవ్వనం, చుక్కమ్మ కథలను విశ్లేషించారు. స్త్రీ అను పుస్తకాన్ని మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ సమీక్షించారు. ఐఆర్ఎస్ అధికారి పిల్లల కోసం పుస్తకాన్ని, ఆధ్యాత్మిక వేత్త రామకృష్ణానంద్ భగవాన్ స్మృతులు పుస్తకాన్ని సమీక్షించారు. మేడా మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, పాలగుడు రాజశేఖర్, అరసం విశాఖ ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పరాజు తదితరులు చలం రచనలపై ప్రసంగించారు.

అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌కు అభినవ్‌రెడ్డి



దాబాగార్డెన్స్: ప్యారిస్ నగరంలో ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌లో నగరానికి చెందిన పన్నెండేళ్ల అభినవ్ రెడ్డి భారతదేశానికి ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఇంటర్మీడియట్ విభాగంలో ఫైనల్స్‌లో పోటీపడుతున్న అభినవ్ దేశ వ్యాప్తంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు. ప్రతిష్టాత్మక సవాల్‌కు సిద్ధమవుతున్న అభినవ్ ప్రయాణం యువ అభ్యాసకులకు ప్రేరణగా నిలుస్తోంది.

హోటల్ బిల్లు చెల్లించకుండా పరారీ

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

తాటిచెట్లపాలెం: హోటల్‌లో దిగి బిల్లు డబ్బులు చెల్లించకుండా పరారైన ఘటనపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసలు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం హైవే సమీపంలోని బీకాన్ హోటల్‌లో డాక్టర్ ఆనంద్ అనే వ్యక్తి ఒడిశాకు చెందిన తన పేషెంట్‌లు పర్వాత్‌కుమార్ బిస్వాల్, బిస్వాల్ మిత్ర, బిస్వాల్ పారియస్‌లు వస్తారని ఆన్‌లైన్‌లో రూంలు బుక్ చేసుకున్నాడు. జనవరి 28న డాక్టర్ ఆనంద్ పంపించారని వీరు రూంలో దిగారు. జనవరి 30న వీరు రూంలు ఖాళీ చేశారు. ఆ సమయంలో బిల్ గురించి అడగ్గా.. డాక్టర్ ఆనంద్ చెల్లిస్తారని చెప్పి వారు వెళ్లిపోయారు. అప్పటి నుంచి డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేస్తున్నా.. అవడం లేదని, బిల్లు సుమారు రూ.15 వేలు అయిందని హోటల్ మేనేజర్ అబ్బాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మళ్లీ జూన్ 29న డాక్టర్ ఆనంద్ ఫోన్ చేసి.. ఏలూరు నుంచి తమ పేషెంట్లు వస్తున్నారని, వీరితో డబ్బులు పంపిస్తానని, వీరికి కూడా రూంలు బుక్ చేయాలని కోరడంతో ఇచ్చారు. వీరు ఒక్క రోజు ఉండి రూమ్ ఖాళీ చేసే సమయంలో బిల్ డబ్బులు అడగ్గా.. డాక్టర్ ఆనంద్ చెల్లిస్తారని చెప్పి వెళ్లిపోయారని హోటల్ మేనేజర్ గురువారం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఐ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆండాళ్ తిరునక్షత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు


గోదాదేవి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా శ్రీఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవాలు ఈ నెల 28న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి ఆలయ ప్రదక్షిణ అనంతరం దర్శనం ఉంటుందని చెప్పారు. తిరుప్పావై పారాయణం, అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తామన్నారు.

25 నుంచి శ్రావణ మాసోత్సవాలు

శ్రావణ మాసంలో నిర్వహించే శుక్రవారం పూజలను ఈ నెల 25 నుంచి నిర్వహిస్తామని ఈవో తెలిపారు. మొదటి శుక్రవారం సందర్భంగా పద్మావతి అమ్మవారికి సహస్ర నామార్చన, కలువ పూలతో ఆరాధన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చన చేస్తారు. ఆగస్టు 1న అమ్మవారికి సంపంగి పూలతో ఆరాధన, 8న గులాబి పూలతో అర్చన చేస్తారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 9న వైభవ వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం అనంతరం స్వామి నిజపాద దర్శనం, అలంకరణ, అర్చన, ఆరాధన మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 15న పద్మావతికి సహస్ర నామ కుంకుమార్చన, పుష్పార్చన, 16న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీవారి సన్నిధిలో అర్చన, ఆరాధన, సాయంత్రం 7 గంటలకు ఉట్టి కొట్టు ఉత్సవం, 22న ఐదో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చన, రజనీ గంథ పుష్పార్చన నిర్వహిస్తారు.

వృద్ధుల బాగోగుల పరిశీలన


ప్రియదర్శిని హోంలో వృద్ధుల బాగోగులు అడిగి తెలుసుకుంటున్న సన్యాసినాయుడు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారం కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం నగరంలోని అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమం, ఆశ్రయ షెల్టర్ హోం, స్వధార్ హోమ్‌లను సందర్శించారు. అక్కడ వసతి పొందుతున్న వృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆశ్రయ షెల్టర్ హోమ్‌లో ఉన్న నిరాశ్రయుల పరిస్థితులను, ప్రియదర్శిని ఆశ్రమంలో వృద్ధుల ఆరోగ్య స్థితిగతులను, స్వధార్ హోమ్‌లో మహిళల జీవన ప్రమాణాలను ఆయన పరిశీలించారు. ఆశ్రమ నిర్వాహకులతో ఆయన మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సహాయం అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రత్యేకించి బలహీన వర్గాలకు, అభాగ్యులకు న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని సన్యాసినాయుడు తెలిపారు.

'వాహనమిత్ర' అమలు చేయాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, కార్మికులు

తాటిచెట్లపాలెం: కూటమి ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన విధంగా రాష్ట్రంలోని ఆటో, మోటారు వాహనాల డ్రైవర్లకు వాహనమిత్ర పథకం వెంటనే అమలు చేయాలని, దీని షరతులు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వరకు గురువారం ఆటోలతో కార్మికులు ర్యాలీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, మోటార్ డ్రైవర్ల సంక్షేమం కోసం వాహనమిత్ర అమలుతోపాటు కార్మిక సంక్షేమానికి కృషి చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడాది కాలం దాటిపోయినా.. ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరకుల ధరలు, పిల్లల చదువుల ఫీజులతో చాలీచాలని ఆదాయంతో జీవిస్తున్న ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఆలోచించాలన్నారు. పోలీస్, ఆర్టీవో డిపార్ట్‌మెంట్ల ద్వారా అడ్డూఅదుపూ లేకుండా డ్రైవర్లపై అక్రమ కేసులు రాస్తూ, వాహనాలు సీజ్ చేయడం, ఫైన్లు విధించడం వల్ల ఆటో డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తూ కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు అడ్డూరు శంకర్, ఎస్.మధురెడ్డి, లంక గోవింద్, పి.కృష్ణంనాయుడు, శ్రీను దల్లి నాని, ఎం.సింహాచలం, చిన్న, కేలం శివ, వై.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.